తల్లిదండ్రుల కలను విద్యార్థులు సాకారం చేయాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

సూర్యాపేట లీగల్, డిసెంబర్ 28: గురువులు, పెద్దలు ఏం చెప్పినా విద్యార్థుల బంగారు భవిష్యత్ కోసమేనని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులతో మాట్లాడొద్దని సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం నేరమని అన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, కాలాన్ని సద్వినియోగం చేసుకొని తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శి డి.మల్లయ్య, డిఫెన్స్ కౌన్సిల్స్ సత్యనారాయణ పిళ్లె, బి.వెంకటరత్నం, ప్రవీణ్‌కుమార్, తలమల్ల హసేన్, సూర్యాపేట జిల్లా టూ టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎం.ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

- జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి

ఎరువులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

హుజూర్‌నగర్ రూరల్, డిసెంబర్ 28: రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని అమరవరం సహకార సంఘంలోని ఎరువులను ఆయన పరిశీలించారు. రైతులకు మార్కెట్ ధరకు ఎరువులను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ రవికుమార్, ఏఓ స్వర్ణ, పీఏసీఎస్ చైర్మన్ అన్నెం శౌరిరెడ్డి, సంఘం సీఈఓ సైదులు, సిబ్బంది పాల్గొన్నారు.

మా టీచర్లు మాకు కావాలి

- గరిడేపల్లి కేజీబీవీ విద్యార్థినుల నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు

గరిడేపల్లి, డిసెంబర్ 28: మా టీచర్లు మాకు కావాలంటూ గరిడేపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థినులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. కేజీబీవీలో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు గత 18 రోజులుగా సమ్మె చేస్తుండటంతో విద్యార్థుల బోధనకు అంతరాయం కలుగుతోంది. ఈ నేపథ్యంలో డీఈఓ ఆదేశాల మేరకు ఎంఈఓ చత్రునాయక్ మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను తాత్కాలికంగా కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి డిప్యూటేషన్ మీద పంపిస్తూ తరగతులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే, రాత్రి సమయాల్లో తమను చూసుకోవడానికి టీచర్లు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రశ్నార్థకంగా భవిత కేంద్రాల నిర్వహణ

దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెలో ఉండడంతో భవిత కేంద్రాలు మూతపడి దివ్యాంగులు సేవలకు దూరమవుతున్నారు. సమ్మె ఎప్పటికి పూర్తవుతుందో, భవిత కేంద్రాలు ఎప్పుడు తెరుచుకుంటాయోనని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ

ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న దిలీప్

మునగాల, డిసెంబర్ 28: మండల కేంద్రంలోని చెరువుగట్టు శివాలయం కల్యాణ మండపంలో తెలంగాణ అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో సంఘం రీజనల్ వైస్ ప్రెసిడెంట్ వాస దిలీప్ శనివారం 12 మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాస శ్రీనివాస్, కళావతి, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలి'

నడిగూడెం, డిసెంబర్ 28: హైదరాబాద్‌లో ఫిబ్రవరి 3వ తేదీన నిర్వహించనున్న 'లక్ష డప్పుల.. వెయ్యి గొంతుకల' సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ కళాకారుల కవాతు కోదాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉప్పల నాగార్జున కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పూర్తయ్యేంత వరకు రాష్ట్రంలో ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు చేపట్టవద్దని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం మాదిగ కళామండలి మండల కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా దున్నా అభిమన్యు, ఉపాధ్యక్షుడిగా యాతాకుల రాజేశ్, ప్రధాన కార్యదర్శిగా కాంపాటి వేణు, సహాయ కార్యదర్శిగా ఎల్.భాను తదితరులను ఎన్నుకున్నారు.

వర్గీకరణ వ్యతిరేకులకు జ్ఞానోదయం కలిగిస్తాం..

చింతలపాలెం: 'లక్ష డప్పుల–వెయ్యి గొంతుకల' సభతో వర్గీకరణ వ్యతిరేకులకు జ్ఞానోదయం కల్పిస్తామని జిల్లా కళాకారుల సంఘం ఇన్‌ఛార్జి కోట వీరస్వామి అన్నారు. శనివారు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు కణితి ప్రశాంత్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కళాకారుల డప్పు కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిలక యేసు, ఉపాధ్యక్షుడిగా యోహాన్, అధికార ప్రతినిధిగా శ్రీను, కార్యదర్శిగా మరియదాసు, మహిళా విభాగం మండలాధ్యక్షురాలిగా తేరోజమ్మను ఎన్నుకున్నారు. ప్రసాద్, బాలచంద్రుడు, ఆరోన్, రమేశ్, కోటి, కృష్ణ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338986-All

LAND FOR SALE
★ గరికపాడు గ్రామంలో (APCRDA West Zone) 2 ఎకరాల వ్యవసాయ భూమి అమ్మకం. వెంచర్లకు అనువైనది. NH-65కు 900 మీటర్లు. ఎకరం: Rs. 75 లక్షలు. 9908271237.
NT-338987

SSC ఒరిజినల్ మెమో పోయినది
చెరుపల్లి బాలకృష్ణ, S/o. చంద్రమౌళి, నాకు సంబంధించిన ఒరిజినల్ SSC మెమో మా ఇంటి దగ్గర నుండి మిర్యాలగూడ బస్టాండ్‌కు బైక్‌పై వెళుతుండగా పోయినది దొరికినవారు. సంప్రదించండి.
సెల్:6281782896

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన మేరకు క్షుణ్ణంగా విచారించడం మీకు మంచిది. పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా తనుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ దర్గపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | తొలుపునూరి: 9182777638

జాతీయ రహదారులపై సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలి

- బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ప్రమాదాలను నివారించాలి
- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

మేళ్లచెర్వు: సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, డిసెంబర్ 28: జాతీయ రహదారులపై సైన్ బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ప్రమాదాలను నివారించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. రోడ్డు భద్రతపై సంబంధిత అధికారులతో శనివారం వెబ్ ఎక్స్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఎన్‌హెచ్ 65, ఎన్‌హెచ్ 365 బి, ఎన్‌హెచ్ 67 రహదారులతో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్లపై ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించాలన్నారు. సర్వీస్ రోడ్లలో స్పీడ్ బ్రేకర్లు, ర్యాంప్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఖమ్మం బైపాస్ సర్వీస్ రోడ్డులో ఈ సమస్య అధికంగా ఉందని తెలిపారు. జనగాం క్రాస్‌రోడ్డులో జరుగుతున్న పనులతో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ మళ్లింపు చేపట్టాలని తెలిపారు. కోదాడ జాతీయ రహదారి ఎన్‌హెచ్ 67 వద్ద అప్రోచ్ రోడ్డు మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కోదాడ– మిర్యాలగూడెం రోడ్డులో గోవిందాపురం వద్ద, ఇతర మలుపుల వద్ద సైన్ బోర్డులు, లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో అంతర్గత రోడ్ల మరమ్మతుల పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ ఈఈ సీతారామయ్య, ఆర్డీఓ వేణుమాధవ్ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి..

మేళ్లచెర్వు: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. శనివారం మేళ్లచెర్వు మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమస్యలపై పలు శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై పలు సూచనలు చేశారు. కాగా, అనుమతి లేకుండా జనావాసాల నడుమ ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ పనులను నిలిపివేయాలని పలువురు స్థానికులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ అప్పారావు, డీపీఓ నారాయణరెడ్డి, డీఈఓ అశోక్, డీఎంహెచ్‌ఓ కోటాచలం, డీఎల్పీఓ యాదగిరి, హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, తాసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ ఖాజా అజ్గర్‌అలీ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్యులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలి

- జిల్లా వైద్యాధికారి కోటాచలం

పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి కోటాచలం

మఠంపల్లి, డిసెంబర్ 28: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. విధులకు హాజరు కాని సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. పీహెచ్‌సీలో సాధారణ కాన్పులను ప్రోత్సహించాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని వెల్లడించారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని, విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తూ.తూ.మంత్రంగా సామాజిక తనిఖీ ప్రజావేదిక

సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

మునగాల, డిసెంబర్ 28: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పనులపై శనివారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక తూ.తూ.మంత్రంగా సాగింది. ఈ కార్యక్రమంలో అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు మాత్రమే పాల్గొన్నారు. సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ప్రజలకు, రైతులకు తెలియజేయడంలో అధికారులు విఫలమయ్యారు. సమస్యలు చెప్పేందుకు ప్రజలు, రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు లేకుండా పోయారు. అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు మాట్లాడుకునేదానికి సామాజిక తనిఖీ ప్రజావేదిక అని పేరు పెట్టడం ఎందుకని ప్రజలు ఆగ్రం వ్యక్తం చేశారు.

ఇండ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

- ఎంపీడీఓ శ్రీనివాస్

మఠంపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

మఠంపల్లి, డిసెంబర్ 28: ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రం మఠంపల్లిలో చేపడుతున్న సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలో 25 గ్రామ పంచాయతీలకు గానూ 80 శాతం సర్వే పూర్తయిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'పంచాయతీ కార్మికులను రెగ్యులర్ చేయాలి'

ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

మేళ్లచెర్వు, డిసెంబర్ 28: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీఓ ఖాజా అజ్గర్‌అలీకి శనివారం వినతిపత్రం సమర్పించారు. కార్మికులను రెగ్యులర్ చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వట్టెపు సైదులు, గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు వెంకన్న, వెంకటేశ్వర్లు, ఉప్పలమ్మ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి నివాళి

రామకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గరిడేపల్లి, డిసెంబర్ 28: మండలంలోని పాత అప్పన్నపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ సర్పంచ్ లింగనబోయిన రామకృష్ణ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. శనివారం బీఆర్ఎస్ నాయకులు రామకృష్ణ నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ నాయకుడు రాపోలు నవీన్‌కుమార్, అధికార ప్రతినిధి రాం సైదులు, మాజీ ఎంపీటీసీ కడప ఇస్సాక్, జిలకర రామస్వామి, లాయర్ విశ్వనాథం, అమరవరపు సతీశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

'దోపిడీ లేని సమాజ నిర్మాణమే సీపీఐ లక్ష్యం'

గరిడేపల్లి, డిసెంబర్ 28: సీపీఐ వందేళ్ల వేడుకలను పురస్కరించుకొని ఈ నెల 30వ తేదీన నల్లగొండలోని ఎన్జీ కాలేజీ మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు కోరారు. శనివారం మండలంలోని కొండాయిగూడెం గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోపిడీ, ఆర్థిక అసమానతలు లేని సమాజ నిర్మాణమే సీపీఐ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య, కుందూరు వెంకటరెడ్డి, పంగ గోవిందు, అంబటి వెంకటరెడ్డి, గోవిందరెడ్డి, కేతిరెడ్డి, సంజీవరెడ్డి, కర్నె సైదిరెడ్డి, పొట్టబత్తిని వెంకటేశ్వర్లు, ఏసుపాదం, షాద్రాక్, వెంకన్న, ప్రేమానందం, బందు రామయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకల పేరుతో అతిగా ప్రవర్తిస్తే చర్యలు

- డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడ రూరల్, డిసెంబర్ 28: నూతన సంవత్సర వేడుకల పేరుతో ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఎం.శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వాహనాలు అతివేగంగా నడిపినా, త్రిబుల్ రైడింగ్ చేసినా కేసులు తప్పవని అన్నారు. పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహిస్తారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల, డిసెంబర్ 28: మండలంలోని ముకుందాపురం సబ్‌స్టేషన్‌లో 33 కేవీ లైన్ పనులు జరుగుతున్నందున సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఇన్‌ఛార్జి ఏఈ పందిరి శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులు పఠనాసక్తిని పెంపొందించుకోవాలి

- జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామారావు

కోదాడ రూరల్, డిసెంబర్ 28: విద్యార్థులు పుస్తక పఠనాసక్తిని పెంపొందించుకోవాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. శనివారం పట్టణ పరిధి కోమరబండలోని తేజ విద్యాలయంలో 'గ్రంథాలయాలు– వాటి ఆవశ్యకత' అనే అంశంపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాల డైరెక్టర్ ఉస్తేల సోమిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకుడు పోతుగంటి నాగేశ్వరరావు, అధ్యాపకుడు నోముల వెంకటేశ్వరావు, ప్రిన్సిపాల్ రమాసోమిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిట్స్ కళాశాలలో డ్రగ్ డిజైన్‌పై వర్క్‌షాప్

చిలుకూరు, డిసెంబర్ 28: మండలంలోని మిట్స్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ ఫర్ ఉమెన్‌లో శనివారం విద్యార్థులకు కంప్యూటర్ ఎయిడెడ్ డ్రగ్ డిజైన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌ను విజయవాడ ఫార్మా స్యూటికల్స్ కంపెనీకి చెందిన కనవరపు రవి కుమార్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు కంప్యూటర్ డ్రగ్ డిజైన్‌పై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. రానున్న రోజుల్లో డ్రగ్ డిజైన్‌కు మంచి భవిష్యత్ ఉంటుందని అన్నారు. వైద్య రంగంలో డ్రగ్ డిజైన్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మధిర ప్రీతిరెడ్డి, వైస్ చైర్మన్ మధిర గౌతమ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్.కేశవరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నర్సిరెడ్డి, ఫార్మసీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ రాము, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి

చివ్వెంల, డిసెంబర్ 28: చివ్వెంల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పదోతరగతి విద్యార్థి జి.విశాల్ రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ విద్యాసాగర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేటలో ఈ నెల 19న జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్–14 విభాగంలో రన్నింగ్, షాట్‌పుట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు.

నియామకం

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 28: సర్వాయి పాపన్న గౌడ్ గీతకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా నాగారం మండలం పస్తాల గ్రామానికి ఎందిన పులుసు వెంకన్న గౌడ్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడూరి పరుశరాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ సంపూర్ణ మల్లేశ్‌గౌడ్ శనివారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకన్నగౌడ్ మాట్లాడుతూ జిల్లాలో గౌడ కులస్తుల సమస్యలపై పోరాటం చేస్తానన్నారు.

ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

- గృహ నిర్మాణ శాఖ ఎండీ గౌతమ్

ఇండ్లను పరిశీలిస్తున్న ఎండీ గౌతమ్, కలెక్టర్

హుజూర్‌నగర్, డిసెంబర్ 28: ఫిబ్రవరి చివరి నాటికి సింగిల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ఎండీ వీపీ.గౌతమ్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో సింగిల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయాన్ని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. రెండు నెలల్లో గృహ నిర్మాణాలు పూర్తి చేసి అర్హులకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, తాసీల్దార్ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పెన్షనర్ల దినోత్సవం

విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

కోదాడ టౌన్, డిసెంబర్ 28: కోదాడలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో శనివారం జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కోదాడ యూనిట్ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావేళ్ల సీతారామయ్య ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ విధానం తీసుకొచ్చేందుకు కృషి చేసిన నకారా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. అనంతరం సంఘం భవనానికి ఆర్థిక సాయం అందించిన వారితో పాటు పలువురు పెన్షనర్లను శాలువాతో ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, సెక్రటరీ బొల్లు రాంబాబు, కోదాడ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సెక్రటరీ రఘువరప్రసాద్, విద్యాసాగర్, అమృతారెడ్డి, పొట్ట జగన్మోహన్, ఖలీల్ అహ్మద్, భ్రమరాంబ, శోభారాణి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ కాని ప్రజాపాలన దరఖాస్తు

- ఇందిరమ్మ ఇంటికి అర్హత కోల్పోయానని బాధితుడి ఆవేదన

తుంగతుర్తి, డిసెంబర్ 28: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన తడకమళ్ల నాగమల్లు ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఆరు గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకున్నాడు. దరఖాస్తు ఫారాన్ని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులకు ఇచ్చి రశీదు తీసుకున్నాడు. తాజాగా గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో భాగంగా అధికారులను సంప్రదించగా నాగమల్లు వివరాలు కనిపించలేదు. దీంతో ఖంగుతిన్న బాధితుడు ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించగా ప్రజాపాలన దరఖాస్తు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని తెలిపారు. దీంతో తనకు ఇల్లు వస్తుందని ఆశపడితే, ఆన్‌లైన్‌లో వివరాలు లేకపోవడంతో బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నాడు.

'విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి'

మఠంపల్లి, డిసెంబర్ 28: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకుడు ఎం.రాజు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మఠంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠశాలలో తాగునీటి సమస్య ఉందని అన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రమేశ్, అభిల్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

'కొత్త రేషన్ కార్డులను జారీ చేయాలి'

హుజూర్‌నగర్ రూరల్, డిసెంబర్ 28: ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సీపీఎం మండల కార్యదర్శి పోసనబోయిన హుస్సేన్ కోరారు. శనివారం మండలంలోని కరక్కాయలగూడెం గ్రామంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అదేవిధంగా నూతన రేషన్ కార్డులను జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు నెట్టి వెంకటేశ్వర్లు, చింతకుంట్ల సైదయ్య, చింతకుంట్ల వీరయ్య, పబ్బతి కోటేశ్వరరావు పాల్గొన్నారు